# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- కరీంనగర్ నియోజకవర్గ ప్రగతిని నిర్దేశించే ఎన్నికలు ఇవి
- రాజకీయ వ్యాపారం చేస్తున్న బండి సంజయ్
- నగరంలో అభివృద్ధి పనులన్నీ నేనే పూర్తి చేస్తా
- బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- నగరంలోని పలు చౌరస్తాల్లో కార్నర్ మీటింగ్



కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, నవంబర్ 27: ఈ ఎన్నికలు ఎంతో కీలకమైనవని, ప్రజలు ఆలోచించి అభివృద్ధి చేస్తున్న వారిని గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం సాయంత్రం ఆయన నగరంలోని భగత్ సింగ్, కోతిరాంపూర్, మారుతీనగర్, సెయింట్ జాన్స్ స్కూల్ చౌరస్తాల్లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, నగరంలో సాగుతున్న అభివృద్ధి కావాలో వద్దో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో వేల కోట్ల నిధులు తీసుకువచ్చి నగరాన్ని అభివృద్ధి చేశానన్నారు. ప్రతి డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సరఫరా మెరుగుపర్చామని తెలిపారు. సమైక్య పాలనలో నగరానికి ఎలాంటి నిధులు రాలేదన్నారు. నగరాభివృద్ధి కోసం ఎంతో కృషి చేసి పనులు చేపట్టామన్నారు. మనం ఒక్క తప్పు చేస్తే అభివృద్ధి వెనక్కిపోతుందన్నారు. ప్రస్తుతం సాగుతున్న అభివృద్ధి కొనసాగాలో లేక నిలిచిపోవాలో నిర్ణయం ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీలను గెలిపిస్తే వారికి అభివృద్ధిపై ఆలోచన ఉండని, స్వార్థ రాజకీయాల కోసం మాత్రమే పని చేస్తారని విమర్శించారు. ప్రస్తుతం నగరంలో సాగుతున్న రోడ్లు, మానేరు రివర్ ఫ్రంట్, మెడికల్ కళాశాల, వేంకటేశ్వరాలయం, ఇస్కాన్ టెంపుల్ పనులు ముందుకు సాగవని పేర్కొన్నారు. ఈ పనులన్నింటినీ తానే పూర్తి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ భూకబ్జాదారుడికి టికెట్ ఇచ్చిందన్నారు. ఎంపీ బండి సంజయ్ ఒక్క రోజు అయినా ప్రజలకు వద్దకు వచ్చారా అని ప్రశ్నించారు.? నగరాభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా తీసుకురాలేని అసమర్థ ఎంపీ అని విమర్శించారు. అక్రమంగా సంపాదించిన డబ్బులతో బీఆర్ఎస్‌కు చెందిన ప్రజాప్రతినిధులను కొనుగోలు చేస్తున్నాడని విమర్శించారు. కౌన్సిలర్లకు రూ. కోటి, ఇతర ప్రజాప్రతినిధులకు రూ.50 లక్షల నుంచి రూ.75 లక్షలు ఇచ్చి పార్టీలో చేర్చుకుంటున్నారని ఆరోపించారు. ఇన్ని వేల కోట్లు బండి సంజయ్ ఏ వ్యాపారాలు చేసి సంపాదించాడో ప్రజలకు చెప్పాలన్నారు. ఆయన రాజకీయ వ్యాపారం చేస్తున్నారని దుయ్యబట్టారు. హిందువునని రెచ్చగొట్టే సంజయ్ నా కంటే పెద్ద హిందువా అని ప్రశ్నించారు.? తాను బ్రహ్మోత్సవాలు చేపట్టానని, టీటీడీ, ఇస్కాన్ ఆలయాలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కరీంనగర్‌కు వచ్చిన మోదీని వేంకటేశ్వర ఆలయం కోసం నిధులు కూడా అడగలేదని విమర్శించారు. కనీసం బండి సంజయ్ పోచమ్మ గుడి అయినా కట్టడా అని నిలదీశారు. బండి సంజయ్ గెలిస్తే వారి పార్టీ అధికారంలోకి వస్తుందా?, నగరాభివృద్ధికి నిధులు తీసుకువచ్చే దమ్ముందా అని ప్రశ్నించారు. ఇలాంటి వారికి ఓటు వేసి వృథా చేసుకోవద్దని సూచించారు. వారికి ఓటు వేస్తే రాజకీయంతో డబ్బులు సంపాదించుకుంటారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. మోదీ రైతుబంధు పంపిణీ నిలిపివేశారని ఆరోపించారు. సంజయ్ తన రాజకీయ లబ్ధి కోసం యువతను పెడదారి పట్టిస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే అభివృద్ధి 20 ఏళ్లు వెనక్కి పోతుందన్నారు. తాను పదిహేను ఏళ్ల ఎమ్మెల్యే జీవితంలో ఎక్కడా లంచం తీసుకోకుండా బతికానని పేర్కొన్నారు. వారిని గెలిపిస్తే నగరంలో మళ్లీ గుంతలమయమైన రోడ్లు వస్తాయని హెచ్చరించారు. కేసీఆర్‌ను ఓడిస్తే అభివృద్ధి నిలిచిపోతుందన్నారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేయర్ యాదగిరి సునీల్ రావు, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, బర్కత్, నర్మద, రాములు, కోల మాలతి, పద్మ, ఐలేందర్, యాదయ్య, నాయకులు నలువాల రవీందర్, ఏవీ రమణ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారానికి హాజరైన ప్రజలు



మాట్లాడుతున్న రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుర్మాచలం

# విజన్ ఉన్న నాయకుడు కేసీఆర్

- గల్ఫ్ వలసలను అరికట్టడంలో ముఖ్యమంత్రి సఫలం
- అభివృద్ధికి అండగా ఉండండి.. బీఆర్ఎస్‌ను గెలిపించండి
- రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుర్మాచలం

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 27: ఒక విజన్ పెట్టుకొని తెలంగాణను పదేళ్లలో అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్ర ప్రజలు అండగా ఉండి మళ్లీ గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ కుర్మాచలం పేర్కొన్నారు. హుజూరాబాద్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, ఎన్ఆర్ఐ నాయకులతో కలిసి మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో, జీడీపీ తలసరి ఆదాయం పెంచడంలో దేశంలోనే మొదటి ర్యాంకులో నిలపడం గర్వకారణం అన్నారు. కేటీఆర్ మేధాశక్తితో అనేక పరిశ్రమలను, విదేశాల్లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలను తెలంగాణకు తెచ్చి ఉద్యోగాలను కల్పించడం ఇక్కడి ప్రజల అదృష్టం అన్నారు. గతంలో వివిధ దేశాలకు వలస పోయిన వారు కూడా తిరిగి తెలంగాణకు వచ్చి ఉపాధి పొందుతున్నారని గుర్తు చేశారు. ప్రపంచంలోని 45 దేశాల్లో బీఆర్ఎస్ పార్టీ శాఖలు పని చేస్తున్నాయని, వారు తెలంగాణలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని అక్కడి ప్రజలకు వివరిస్తున్నారని తెలిపారు. బంగారు తెలంగాణ ఏర్పాటు కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్‌కు రాష్ట్ర ప్రజలు అండగా ఉండాలన్నారు. అలాగే, స్థానిక బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డిని ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించుకోవాలన్నారు. సీఎం కేసీఆర్‌తో నేరుగా మాట్లాడి ఎన్ని నిధులైనా తెచ్చి అభివృద్ధి చేసే సత్తా ఉన్న కౌశిక్‌రెడ్డిని హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజలు గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వారు యువకులతో సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, గల్ఫ్ దేశాల ఉపాధ్యక్షుడు సతీశ్, యూకే బీఆర్ఎస్ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, కార్యదర్శి రమేశ్, వివిధ దేశాల నాయకులు మధుయాదవ్, ప్రవీణ్, రాజ్‌కుమార్, లక్ష్మారెడ్డి, ఎస్‌కే ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పెట్టుబడి సాయం నిలిపివేసిన పాపం కాంగ్రెస్, బీజేపీలదే



రైతులకు పెట్టుబడి సాయం పంపిణీ ఆపాలని ఎన్నికల కమిషన్‌కు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు కలిసి ఫిర్యాదు చేసి నిలిపివేయించారని రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. రైతులను అభివృద్ధి చెందడాన్ని చూసి ఓర్వలేకనే కాంగ్రెస్, బీజేపీ నాయకులు రైతుబంధు డబ్బులు వేయకుండా అడ్డుపడ్డారని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ముందు చూపుతో రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు రైతు బంధు, రైతు బీమాతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి రెండు పంటలకు సాగునీరు, 24 గంటల ఉచిత కరెంటు అందించి రైతు పక్షపాతిగా వ్యవహరిస్తే, ప్రతిపక్ష పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు రైతు ఘాతక పార్టీలుగా మారాయన్నారు. రైతు బాగుంటే రైతు రాజ్యం బాగుంటుందని నమ్మి కేసీఆర్ రైతు బంధు ఇవ్వాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేసి ఒప్పించగా రైతుల పట్ల కపట ప్రేమ నటిస్తూనే రైతు వ్యతిరేక విధానాలకు కాంగ్రెస్, బీజేపీలు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు రైతులు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రైతు పక్షపాతి కేసీఆర్‌కు అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

-రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్

# పథకాలను మెచ్చే బీఆర్ఎస్‌లో చేరికలు



ముదిరాజ్ సంఘం నాయకులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి, నవంబర్ 27: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. రామడుగు మండలం దేశరాజ్‌పల్లి ముదిరాజ్ సంఘం సభ్యులు పండుగ రమేశ్, జంగపల్లి అంజయ్య, పిట్టల శేఖర్, నిమ్మనవేణి నర్సయ్య, నిమ్మనవేణి సురేశ్, నిమ్మనవేణి అంజయ్య, జంగపల్లి అంజయ్యతో పాటు పలువురు సోమవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కాగా, ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవిశంకర్ మాట్లాడుతూ, నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నట్లు తెలిపారు. గతంలో స్థానికేతరులు ఎమ్మెల్యేలుగా గెలిచి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేకపోయారని విమర్శించారు. ఎన్నికల ముందు వచ్చి తర్వాత వెళ్లిపోయే నాయకులకు ఈ ప్రాంతం మీద మమకారం ఉండదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎల్కపెల్లి లచ్చయ్య, గ్రామాధ్యక్షుడు పెగడ లచ్చయ్య, మాజీ ఎంపీటీసీ మ్యాన మురళి, దొబ్బల మధు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఎంఎస్‌లపై నిషేధం

- జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కలెక్టరేట్, నవంబర్ 27: ఈనెల 30న జరుగనున్న సాధారణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఎస్ఎంఎస్‌లపై నిషేధం విధించినట్లు జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్‌కు ముందు 48 గంటల సైలెన్స్ పీరియడ్‌లో రాజకీయపరమైన ఎస్ఎంఎస్‌లు, బల్క్ ఎస్ఎంఎస్‌లను పంపరాదని, పంపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈనెల 28 సాయంత్రం 5 గంటల నుంచి 30వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు నిషేధం కొనసాగుతుందని వెల్లడించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఈ చర్య తీసుకున్నట్లు ప్రకటించారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు తమ ప్రచారంలో భాగంగా ఈసీ సూచనలు ఉల్లంఘించరాదని స్పష్టం చేశారు. అభ్యంతరకరమైన ఎస్ఎంఎస్‌లు పంపితే, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్ఎంఎస్‌లు పంపడానికి అయ్యే ఖర్చులను కూడా పరిగణలోకి తీసుకుని అభ్యర్థుల వ్యయంలో లెక్కిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఈ ఆదేశాలపై అప్రమత్తంగా ఉంటూ, పోలింగ్ ముగిసే వరకు సంక్షిప్త సందేశాలు పంపవద్దని సూచించారు.



గురుద్వార్‌లో పూజలు చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్

## త్యాగానికి మారుపేరు సిక్కులు

కార్పొరేషన్, నవంబర్ 27: త్యాగానికి, దేశభక్తికి మారు పేరు సిక్కులు అని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. గురునానక్ జయంతిని పురస్కరించుకొని సిక్ వాడీలోని గురుద్వారాలో సోమవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. సిక్కు మత గురువులు మంత్రి గంగుల కమలాకర్‌కు ఘన స్వాగతం పలికి.. సత్కరించి తలపాగా చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ, భారతీయుల్లో దేశభక్తిని పెంపొందించిన వ్యక్తి గురునానక్ అని కొనియాడారు. గురునానక్ స్ఫూర్తితోనే వేలాది మంది సిక్కులు దేశ రక్షణకు కృషి చేస్తున్నారని చెప్పారు. మంత్రి వెంట మేయర్ యాదగిరి సునీల్ రావు, సిక్కులు ఉన్నారు.